# కుపుత్రో జాయేత

భార్గవ

చెడ్డవాడైన పుత్రుడు కలగవచ్చునుకాని దుష్టురాలగు తల్లి ఉండదని శ్రీ దేవ్య పరాధక్షమాపణ స్తోత్రంలో ఆచార్యులవారన్నారు. సర్వే సర్వత్ర అన్నట్లు ఇది నిజమే కావచ్చు. నా జీవితంలో మటుకు ఇది తారుమారైంది. ఒక కుమాతకు కుపుత్రుడు, కుపుత్రిక వున్నారు. నా బ్రతుకుతో ఆటలాడుకున్నవారే వీరు.

సీతమ్మ కొడుకు జనార్దనం, కూతురు కమల. ముగ్గురూ స్వార్థం ముందు పుట్టిన తర్వాత జన్మించిన వారే. ముగ్గురికీ డబ్బుమీద ఉన్న కాంక్ష ఇంతా అంతా కాదు. తల్లి, కూతురు బంగారం బిస్కట్లు పోగుచేసు కోవటంలో మునిగినవారే. కమలకు నారాయణతో వివాహమైంది. కృష్ణ, భాస్కర్, శేఖర్ వారి పిల్లలు. జనార్దనానికి లలితతో వివాహమైన తర్వాత ఆయనలో పశుత్వం ప్రబలిందని విన్నాను. గోపాలం, రాము, లక్ష్మి అని వాళ్ళ సంతానం. పిల్లలను ఏడిపించకపోతే ఆయనకు తోచేదికాదుట. పైగా చెడ్డ అనుమానం గల మనిషి. పేకాటలో సిద్ధహస్తుడు. బాగా చదువుకున్నవాడే, ఐతే ఏం లాభం? భార్యకు విడాకులిచ్చి తెగతెంపులు చేసు కున్నాడు. దీనికి తల్లి, చెల్లెలు బాగా ప్రోద్బలమిచ్చా రన్నారు. ఆ తర్వాత నన్ను చేసుకున్నారు. అనుమానా లతో, ధన వ్యామోహంతో, జూదమనే వ్యసనంతో నిండిపోయిన వాడికి వివాహమెందుకో అర్థం కాదు. కాని నన్ను చేసుకున్న తర్వాత ఆయన దశ తిరిగింది. లక్నోలో ప్రొఫెసర్‌గా నియమింప బడటంవల్ల మా కాపరం అక్క డకు చేరింది. ఏదో సాకుతో నన్ను హింసించని రోజు లేదు. ఆయన టైంటేబిల్‌లో ఇది ఒక పీరియడ్. మేష్టర్ కావటం చేత ఏ పీరియడ్ తీసికొనకపోయినా ఇదిమటుకు ముఖ్యమైనది. మిగతా కాలంలో క్లాసులకు పోవటానికి తీరిక ఎక్కడుంటుంది? క్లబ్బుల్లో పేకాట ముఖ్యం గదా! ఆయన అమ్మమ్మ మా దగ్గరే వుంది. ఆవిడ చాలా సాధు జంతువు. ఆవిడే గనక నాకు అండగా లేకపోతే నేనెప్పుడో గతించి వుండేదానిని. ఆవిడ పొలాన్ని కాజేయాలనే సంకల్పం బాగా వుండడంచేత ఆవిడ మాటకు అడ్డు రాలేక పోయేవారు. ఆవిడకు ఈయన తల్లి ఒక్కత్తే. వేరే సంతానం లేదు.

క్లాసులకు సరిగా పోకపోవటంచేత ఉద్యోగం ఊడిపోయే పరిస్థితి ఏర్పడింది. పాఠం చెప్పే విషయంలో ఆరితేరిన దిట్ట. కాని డబ్బు కావాలి. ఈ లోగా రాయపూరు విశ్వవిద్యాలయం క్రింద ఉన్న ఒక కాలేజీకి ప్రిన్సిపాల్ కావాలన్నారు. వారికి కావలసిన అర్హతలన్నీ ఈయనకొక్కడికే వుండడంచేత అక్కడకు చేరు కున్నాము. కథ మామూలే. కొంతకాలం—అంటే పేకాట వాళ్ళతో పరిచయం కలిగేదాకా పొలు బాగానే చెప్పే వారని తెలిసింది. తర్వాత ఆ విద్యాలయంవారు ప్రొబేషన్ని పొడిగిస్తూ వచ్చారు.

నాకు చిన్నప్పటిమంచి పిల్లలంటే వెర్రి ఆపేక్ష. నాకు కూడా పిల్లలు కలిగితే ఈ లోకాన్నే స్వర్గం చేస్తాను. కాని పిల్లలు కలగలేదు. పరీక్ష చేయించుకుంటే నాలో ఏ లోపమూ లేదన్నారు. మరి ఆయనలో వుంటే మొదటి ఆవిడకు ఎలా కలిగారు? ఆవిడ చాలా మంచిదని అన్నారు. అంటే శస్త్ర చికిత్స చేయించుకుని నన్ను మోసం చేయాలనే పెళ్ళి చేసుకొన్నారా? తన అనుమాన నివృత్తి ఇలా జరుగుతుందనా? ఒకనాడు నిలదీసి అడిగితే ఒప్పుకున్నారు చికిత్స ఐందని.

ఐతే నన్ను ఆ తర్వాత చేసుకోవటంలో మీ ఉద్దేశ్యం?

నీకు పిల్లలెందుకు? ఇప్పుడు హాయిగా ఉన్నాంగా!

పిల్లలు కావాలి. మీరెప్పుడోగాని ఇంటికి రారు. పిల్లలుంటే ప్రొద్దుపోతుంది.

పెంచుకుందువుగానిలే.

ఎప్పుడు?

మీరా పిల్లలను వేధించనని మాట ఇస్తే.

ఇస్తాగాని పసిమిరంగు కావాలి.

ఎవరిస్తారు? పసిమిరంగుట, పసిమిరంగు. ఈయన రంగేమిటో తెలుసుకున్నారా? నా తండ్రి నా చిన్ననాడే పోయినాడు. నా అక్క భారతి పెళ్ళిచేసుకుని ఇద్దరు కూతుళ్ళను, ఒక కొడుకును కన్నది. భర్త మంచి ఉద్యోగంలో వున్నాడు. రెండో పిల్లను పెంపుడిస్తారా? నా అన్న కులాంతర వివాహం చేసుకోవటంతో మాకు దూరమై పోయినాడు. మాకెలాంటి ఆస్తిపాస్తులు లేవు. అత్త, ఆడబిడ్డ, మొగుడు మా బీదరికాన్ని అవహేళన చేయని దినం లేదు. బీదరికం మంచి నన్ను ఉద్ధరించా రుట. ఎప్పుడైనా మా అమ్మ దగ్గరకు మేం వెళ్తే ఆయనకు రాజోపచారాలు జరగాలి. ఎలా చేస్తుంది? ఐనా తనకు వీలైనంతవరకు ఏ లోపమూ చేయదు. మా అక్క పిల్ల సంగతి చెప్తే వీలులేదన్నారు. కావలసివస్తే దాని పెళ్ళికి సహాయం చేద్దాంలే అన్నారు. మొండి కేశాను. దాని ఫలితంగా అత్త, భర్త కలిసి నన్ను చావ గొట్టారు. నాకు నగలు పెట్టడమైతే జరిగింది గాని ఏ వూరన్నా వెళ్ళాలంటే వాటిని అన్నింటినీ అప్పచెప్పి పోవాలి. ఆడబిడ్డ చేతిలో సూటిపోటీ మాటలు.

మొగుడు ఇంట్లో వుండడు. వుంటే మటుకు? తిట్లు, దెబ్బలేగా. పిల్లలు లేరు. స్నేహితురాళ్ళతో కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు, వాళ్ళతో సినిమాలకు వెళ్ళినప్పుడు ఏ దివ్యదృష్టి వుందో, మధ్యలో వెతు క్కుంటూ వచ్చి, బరబరా లాక్కుపోయేవారు. నాకు తలవంపులు. నా స్నేహితురాళ్ళకీయన సంగతి బాగా తెలుసు కనుక నామీద సానుభూతితో ఏమీ అనేవారు కాదు. ఆయననే విమర్శించేవారట. చెల్లెలు కొడుకును చదువుకని మా దగ్గరకు తెచ్చారు. వాడు ఈయనలాగే బడి ఎగగొట్టి తిరగటంతో, చదువుమీద శ్రద్ధ లేక పోవటంతో తప్పి కూచున్నాడు. ఫలితం వాడికి ఉద్వాసన. మరిచిపోయినా, అమ్మమ్మ గతిస్తూ ఈయనకే అంతా ఇచ్చి పోయింది. దానిని డబ్బులోకి మార్చి దాచుకున్నారు. నాకు పిల్లలు కలగరని ముందే తెలుసుకున్న మా ఆడబిడ్డకు దుర్బుద్ధి పుట్టింది. ఈయన ఆస్తినంతా మేనల్లుళ్ళకు వ్రాయించుకోవాలి. ఇలా వుండగా ఒక కారు ప్రమాదంలో ఆవిడ భర్త, ఒక కుమారుడు దుర్మరణం పాలైనారు. ఏ కోశానా దుఃఖం లేని ఈ మహాతల్లి రావలసిన డబ్బునంతా వసూలు చేసుకొని మద్రాసులో పెద్ద ఇల్లు కట్టింది. నాకు ఆడ పిల్లనే పెంచుకోవాలని కోరిక. చాలామందిని అడిగాము. వాళ్ళకు ఇవ్వాలని వున్నా ఈయన గుణగణాల మూల కంగా నిరాకరించారు. మేమిద్దరమూ అనేక శరణా లయాలను చూచాము. ప్రతి పిల్లకూ వంక పెట్టడమే. పెంచుకోవటం అసలు ఈయనకే ఇష్టం లేదని నిశ్చయ మైంది. చెల్లెలు మారిపోసినట్లుంది. మేనల్లుళ్ళకి ఆస్తి సంక్రమించాలి. వేనెలాపోయినా పర్వాలేదు. బీదరికం నుంచి వచ్చినదాన్ని బీదతనంతోనే కాలం గడపాలి. కాని నన్ను మభ్యపెట్టడానికి ఆ వూళ్ళోనే ఒక ఇల్లు కొన్నారు. ఆ మధ్య మా అక్క కూతురు పెళ్ళికి బాగానే సహాయం చేశారు. ఉద్దేశమేమిటో అంతుబట్ట లేదు. నాకెలా తెలుస్తుంది? బీదదానికి బీద బుద్ధులు రాలేదు. అదీ నాలో సుగుణమని మావాళ్ళంటారు.

పరేకాని మావారి ముచ్చట్లు వినండి. క్లాసులకు పోకపోయినా జీతం మటుకు రావాలి. అధికారులతో తగాదా. కన్ఫర్మ్ చేయకుండా తిప్పలు పెట్టారు. ఉద్యోగం ఊడిపోయే పరిస్థితుల్లో భువనేశ్వర్‌లో ప్రిన్సి పాల్ పదవి వచ్చింది. పిల్లి తన కూనలతో స్థానాన్ని మార్చే రీతిగా మేము భువనేశ్వర్ చేరుకున్నాము. ఊరు మంచిదే, అక్కడివాళ్ళు కూడా మంచివాళ్ళే. పేకాట మామూలే. ఏడాది గడిచింది. యూనివర్శిటీ తరఫున అన్వేషణకు ఒక సంఘం ఏర్పడింది. ఆ తారీఖును మరిచిపోయి క్లబ్బులో ఆడుతున్నారు. ఫలితం చెప్పాలా? రెండేళ్ళు నిండకుండానే సస్పెండు చేశారు. రాయపూర్ వాళ్ళుమీద బకాయిలకొక కేసు వీళ్ళమీద ఒక కేసు వేసి మద్రాసు చేరాము. ఒక్క పేకాటలోనే కాదు. ఎలాంటి లాటరీలోనైనా ఈయన హస్తవాసి గొప్పది. ఉద్యోగం లేదు. ఐతేమాత్రం? ఒక కిరాణాకొట్టు కొన్నారు. ఆ కేసులు తేలలేదు గాని, వ్యాపారం రెండేళ్ళు నడిచింది. కాని ఆయన కొట్లో వుంటేనేగా? నాకు మాత్రమేం

పట్టింది. ఆడబిడ్డ ఎలానూ కాజేస్తుంది. ఈయన వున్నంత కాలమైనా సంపదను అనుభవిస్తే? ఈ ఆలోచనలతో ఆయనకు తెలియకుండా దానధర్మాలు మొదలుపెట్టాను. దుకాణం దివాలా. మూసివేశాం. ఒక యూనివర్సిటీ నుండి డబ్బులు వచ్చినవి. రాగానే ఈగలు వాలినై. నేను పరాయిదానిని. బీదరికంలో పుట్టి పెరిగిన దానిని. బంగారమంటే నాకేం తెలుసు? హింసలు ఎక్కువైనవి. ఆయన సంపాదనలో నాకు హక్కు ఏ మాత్రమూ లేదని అత్త, ఆడబిడ్డ. నేనెలా వస్తే వాళ్ళకేం? బాధలు. మొదటి భార్య కూతురు వివాహానికి వెళ్ళి వచ్చారు. ఇదే సమయమని నా వంటి మీద బంగారాన్ని అమ్మి చిన్న ఇల్లు నా పేరుతో ఏర్పరచుకొన్నాను. ఒక నెల రోజులు ఇంటి చాయలకు, పోలేదు. తల్లీ కూతురు శోకాలు. నేను కనబడనందుకు కాదు, నాతో బంగారం పోయినందుకు. నే రాగానే రంకు పురాణాలు అంటగట్టసాగారు. దానితో ఆయన రెచ్చిపోయి చెయ్యి ఎత్తారు.

"చెయ్యి నామీద పడ్డదా, మీరు బ్రతకరు."

"ఏం చేస్తావు?"

"చంపేస్తా."

"అంతదాకా వచ్చిందా?"

"నన్ను మోసంచేసి పెళ్ళి చేసికొని ఈ దౌర్జన్యం ఎంత కాలం?"

"నా ఇష్టం."

"నా ఇష్టం కూడా గమనించాలి."

"వెళ్ళిపో. ఇక్కడ వుండటానికి వీలులేదు."

"నాకు రావలసింది ఇస్తే..."

"నీకేం రాదు."

"నీ చెల్లెలుకూ రాదు."

—అలా సాగినై మా రాజీ సంభాషణలు. శ్రుతి మించిందని రాజీ ధోరణిలోకి దిగింది మా ఆడ బిడ్డ. ఎందుకంటారా? ఇంతకుముందే మా ఆయనకు ఒక లాటరీ ఇల్లు వచ్చింది. ఆ ఇంటిని కాజేయాలి. నాతో సఖ్యంగా వున్నట్లు నటిస్తే మార్గం సులువౌతుందని ఆమె అంచనా. వితంతువైనా రోజూ శోభనపు పెళ్ళి కూతురిలాగా అలంకరించుకుంటుంది. విటులున్నారా? నాకేం తెలుస్తుంది?

వారానికి రెండువాళ్ళు నేనింట్లో నుంచి ప్రొద్దున్నే వెళ్ళి చీకటి పడ్డ తర్వాత రావాలి. ఎందుకో నాకు మొదట్లో తెలియలేదు. ఒకనాడు తిరిగివస్తూ చూచాను. ఎవరో ఒక మధ్యవయస్కురాలు మా ఇంటిమంచి వెళుతున్నది. ఎందుకు? అయోమయంగా వున్నది. తర్వాత మంచానపడ్డారు. రోజూ మా ఆడబిడ్డ, అత్త వస్తున్నారు. ఏవో గుసగుసలు. తర్వాత తెలిసింది. నా అనంతరం ఈ ఇంటిని నేమల్లుళ్ళకు చెందేటట్లు వ్రాయించుకొని రిజిష్టరీ చేయించారని విన్నా. దాని నకలు సంగ్రహించాను. రాయపూర్ ఇల్లు మాత్రం నాకే వదలివేశారు. మహోపకారం. ఆనాటి నుంచి వాళ్ళు మా ఇంటికి రావడం మానేశారు. ఈయనకు జబ్బు ముదిరింది. అన్నాన్ని చూస్తే అన్నంగా కనబడేది కాదనేవారు. ఆయన కళ్ళకు గంతలు కట్టి మజ్జిగ రసాన్ని పోస్తున్నాను. ఎక్కువకాలం బ్రతకలేదు. ఐనా తల్లి, కూతురు రాలేదు. నా సవతి కొడుకులను పిలపించి కర్మకాండ జరిపించాను.


రోజులు వెళ్ళిపోతున్నవి. రాయపూర్‌లోని ఇంటిని అద్దెకిదివరకే ఇచ్చారు. కొంతకాలమైన తర్వాత అద్దె డబ్బులు రావటం లేదు. ఖాళీ చేయమని నోటీసు ఇచ్చాను. ఖాళీ చెయ్యలేదు. కోర్టుకి వెళ్ళవలసి వచ్చింది. నా విషయమంతా పూసగ్రుచ్చినట్లు అద్దెకున్నవాడికి మా ఆడబిడ్డ వ్రాసిందని తెలిసింది. ఇల్లు తనదేనని, నాకేవిధమైన హక్కూ లేదని వాడి వాదం. ఎలాగైతేనేం కేసు గెలిచాను. దానితో మా ఆడబిడ్డ వైఖరి మారింది. ఎందుకంటారా? ఈ ఇంటిని కాజేయాలి. ఒకవేళ నేనే దానిని అమ్మితే ఆ డబ్బును కాజేయాలి. ఎంతో



సౌమ్యంగా మాట్లాడుతూ రాకపోకలు సాగించింది. అన్నీ పోయినవాడు రాలేదు. తల్లి సరేసరి. మద్రాస్‌లోని ఇంటిని దఖలు చేసుకున్న నాటి నుంచి అసలు దర్శనమే లేదు. తనవద్ద తల్లి వుంటే ఖర్చు ఔతుందని మా ఆడబిడ్డ ఆవిడను పంపించివేసింది. నా అక్క వగైరాలు కూడా నా దగ్గరే తిష్ఠ. డబ్బుకోసం. మా ఆడబిడ్డకు పెన్షన్ బాగా వస్తుంది. కొడుకులు చాలా సంపాదిస్తున్నారు. ఒక ఇల్లు వున్నది. రెండో ఇంటిని వ్రాయించుకున్నది. ఇంకా డబ్బు కావాలి. వడ్డీ వ్యాపారం కూడా వున్నది. అత్త దగ్గర కూడా ఎన్ని కిలోల బంగారముందో చెప్పలేను. ఆవిడకు కూడా వడ్డీ వ్యాపారమున్నది. ఏమీలేని దానిని నేనే. కాని నా దగ్గర నుంచి ఏమన్నా రాబట్టటానికి వీలుంటే వీళ్ళందరకు నేను చాలా ముఖ్య బంధువునౌతాను.

ఎన్ని ఇబ్బందులని చెప్పను? ఇంటిమీద కేసులో స్నేహితురాళ్ళ ద్వారా వాళ్ళ భర్తలు సహాయపడ్డారు. మంచి ప్లీడరును పెట్టాలంటే వాళ్ళకు లంచంబెట్టి నా కేసు తీసుకోకుండా చేసిన ఘనత మా ఆడబిడ్డది. నాకా ఇంటిమీద హక్కే లేదని అద్దెకున్నవాణ్ణి ప్రేరేపించింది కూడా ఈవిడే. సహాయంగా నిలబడమని సవితి పిల్లలను అడిగితే ముందే వేలకువేలు కుమ్మరిస్తే వస్తామన్నారు. ఎక్కడ నుంచి తేగలను. అద్దెవాడు పెట్టిన బాధలు ఇంతా అంతా కాదు. తలుపులకు తాళాలు వేయటం, నీళ్ళు రాకుండా ఆపుచేయడం, లైట్లు లేకుండా వుంచటం లాంటివి ఎన్నో చేశాడు. బ్రతికి వున్నప్పుడు, పోయిన తర్వాత కూడా మా ఆయన వేధిస్తూనేవున్నారు. వీడిని ఖాళీ చేయించాలి. కేసు గెలిచినా ఖాళీ చేయించలేక పోతున్నాను. అత్తకు కూతురక్కరలేదు. కూతురుకి తల్లితో సంబంధం అనవసరం, కొడుకులవైనా సరిగా చూస్తుందా అంటే అదీ లేదు. వాళ్ళ తిప్పలు వాళ్ళవి. వాళ్ళమాత్రం జీతం డబ్బులు తెచ్చి ఆవిడకు కుమ్మరిస్తే చాలు. ఇలా జీవితం నడుపుతున్న నాకు కుమార్తెలుండరని ఎలా నమ్మకం కలుగుతుంది. వుంటారు. కాని అందరూ అలా వుండరు. మంచి పిల్లను పెంచుకొని వివాహం చేయాలి. పూజా పునస్కారాలు, దాన ధర్మాలు ఇందుకే చేస్తున్నాను. భవిష్యత్తు ఎలా వుంటుందో!

*



# ఆంధ్రజ్యోతి

సచిత్ర వారపత్రిక

## * 1986 పద్మాలయవారి *

నవలా నవమోహిని

## సస్పెన్స్ థ్రిల్లర్ నవలలపోటీ

## రూ.9,000 బహుమతులు

తెలుగు పాఠకుల అభిరుచులలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విజయవాడలోని "పద్మాలయా పబ్లికేషన్స్" సంస్థవారు ఆంధ్ర జ్యోతి సచిత్ర వార పత్రిక సహకారంతో పై నవలల పోటీని నిర్వహింప నిశ్చయించారు.

రచయితలు, రచయిత్రులు సమధికోత్సాహంతో పాల్గొని ఈ సస్పెన్స్ థ్రిల్లర్ నవలల పోటీని విజయవంతం చేసి "మూడువేల రూపాయలు" చొప్పున "మూడు విడిబహుమతుల"ను గెలుచుకొని పాఠకుల్ని అలరింపగలరని ఆశిస్తున్నాము. ఈ పోటీ నిమిత్తం ఉత్తమ సస్పెన్స్ థ్రిల్లర్ నవలలను రచయితల, రచయిత్రుల నుంచి ఆహ్వానిస్తున్నాము.

**నిబంధనలు:**

1)* బహుమతి పొందిన నవలలను పద్మాలయా పబ్లికేషన్స్‌వారు ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రికలో సీరియల్ అయాక పుస్తక రూపంలో ప్రచురించుకొనే హక్కును కలిగి ఉంటారు.

* బహుమతులు గెలుచుకొన్న మూడు సస్పెన్స్ థ్రిల్లర్ నవలలను పద్మాలయా సంస్థ ప్రకటిస్తుంది.

* ఈ నవలలకు వేరే 'రెమ్యూనరేషన్' అంటూ ఉండదు.

* బహుమతి మొత్తమే పుస్తక రూపంలో ప్రకటించుకోవడానికి కూడా హక్కులు కల్పిస్తుంది.

2)* పోటీకి పంపే నవలలు అరఠావు సైజులో 150-200 పేజీలకు మించకుండా ఉండాలి.

* కాగితానికి ఒకపక్కనే సిరాతో స్పష్టంగా వ్రాయాలి.

3)* అనువాదాలు, అనుకరణలు పంపరాదు.

* నవల తన స్వంతమని ఇంతకు ముందు అచ్చుకాలేదని, అనుకరణ, అనువాదం కాదని హామీ పత్రం రాసియివ్వాలి.

* కవరుపైన "పద్మాలయా వారి సస్పెన్స్ థ్రిల్లర్" నవలల పోటీకి అని స్పష్టంగా రాయాలి.

* అంగీకరించని నవలల వ్రాత ప్రతులను తిప్పిపంపడానికి వీలుగా తగిన పోస్టేజీ అతికించి, సొంత విరునామా రాసిన కవరును విడిగా జతచేసి పంపాలి.

4)* నవలల పోటీ ఫలితాలు ఆంధ్రజ్యోతి సచిత్ర వార పత్రిక 1986 సంక్రాంతి సంచికలో ప్రకటిస్తాము.

* బహుమతి పొందిన మూడు నవలల్లో ఒక నవల ప్రచురణ సంక్రాంతి ప్రత్యేక సంచిక నుంచి ప్రారంభం అవుతుంది.

* బహుమతుల నిర్ణయంలో ఆంధ్ర జ్యోతి సచిత్ర వార పత్రిక సంపాదకులదే తుది నిర్ణయం.

* బహుమతి ఫలితాల గురించి ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలు జరపబడవు.

* 'పద్మాలయా పబ్లికేషన్స్' సంస్థ విజయవాడవారు పుస్తకరూపంలో ప్రకటించడానికి అంగీకరించినవారే పోటీలో పాల్గొనాలి.

* విూ నవలలను—

ఎడిటర్

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

పి.బి.712 విజయవాడ-520 010 కుపంపాలి

నవలలు మాకు చేరవలసిన

ఆఖరి తేదీ *15—12—'85* వరకు గడువు పొడిగించడమైనది